

సాక్షి గణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో లోకకల్యాణార్థం బుధవారం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు.



బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను విస్తృతం చేయాలని కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ అన్నారు. బుధవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 8లో▸



కార్డుదారులకు కందిబేడలు

డిసెంబర్ నెల నుంచి రేషన్‌కార్డుదారులందరికీ సబ్సిడీపై కంది బేడలను అందించనున్నారు. ఎండీయూ ఆపరేటర్లకు రూ.67 చెల్లిస్తే ప్రతికార్డుకు కేజీ చొప్పున ఇవ్వనున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

సత్వర న్యాయమే లోక్ అదాలత్ లక్ష్యం



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ జడ్జి వెంకట హరినాథ్

కర్నూలు (లీగల్): ఎలాంటి కోర్టు ఖర్చులు లేకుండా సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని శాశ్వత లోక్ అదాలత్ జడ్జి వెంకట హరినాథ్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ సేవాసదన్‌లో అన్ని శాఖల అధికారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకట హరినాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లోక్అదాలత్ తీర్పుకు ఎలాంటి అప్పీలు లేదన్నారు. పది ప్రజాప్రయోజిత సేవా రంగాలకు సంబంధించిన సేవాలోపాల వలన కలిగే నష్టాలను విన్నవించి, సంబంధించిన న్యాయం త్వరగా పొందవచ్చన్నారు.

శ్రీశైలానికి 2,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

శ్రీశైలంప్రాజెక్ట్/ గూడూరు రూరల్: శ్రీశైలం జలాశయానికి సుంకేసుల నుంచి 2,687 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు అధికారులు 3,743 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యాక్‌వాటర్‌నుంచి హంద్రీ–నీవా సుజలస్రవంతికి 1,013 క్యూసెక్కులు, ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 245 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతలకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం జలాశయంలో 59.9829 టీఎంసీల నీరు నిల్వఉంది. డ్యామ్ నీటిమట్టం 838.70 అడుగులకు చేరుకుంది. సుంకేసుల నుంచి కేసీ కెనాల్‌కు 2,354 క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.200 టీఎంసీ నీటి నిల్వ ఉంది.

వేసవి దాహార్తికి రూ.14.90 కోట్లతో ప్రతిపాదనలు

కర్నూలు(అర్బన్): రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు రూ.14.90 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షక ఇంజినీరు బీ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 721 జనవాసాలు ఉండగా, 169 జనవాసాలకు వేసవిలో కొంత ఇబ్బంది ఉండవచ్చని అంచనాకు వచ్చామన్నారు. ఈ నేపథ్యంలో ఆయా జనవాసాలకు రవాణా ద్వారా నీటిని అందించేందుకు రూ.11.68 కోట్లు, వ్యవసాయ బోర్ల, ఇతర సోర్సుల అద్దెకు రూ.10 లక్షలు, ట్యాంకులను నింపేందుకు రూ.50 లక్షలు, బోర్ల డీపెనింగ్, ఫ్లషింగ్‌కు రూ.2.62 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించి పంపామన్నారు. ప్రస్తుతం తాగునీటి ఎద్దడి తలెత్తితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిని అందిస్తున్నట్లు చెప్పారు.

నూతన ఈవోలకు పోస్టింగులు

కర్నూలు కల్చరల్: ఏపీపీఎస్సీ ద్వారా దేవదాయ శాఖ గ్రేడ్–3 ఈవోలుగా ఎంపికైన ఐదుగురికి పోస్టింగ్స్ ఇచ్చారు. ఆరు నెలల వృత్త్యంతర శిక్షణ పొందిన వీరికి స్థానాలను కేటాయించారు. కర్నూలు నగరం బళ్లారి చౌరస్తాలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఈవోగా ఆది జమ్ములమ్మ, మామిదాలపాడు మాధవ ఆంజనేయ స్వామి దేవాలయం గ్రూప్ టెంపుల్స్ ఈవోగా అభిమన్యు రావు, వెల్దుర్తి గ్రూప్ టెంపుల్స్ ఈవోగా ఆంజనేయులు, బనగానపల్లె గ్రూప్ టెంపుల్స్ ఈవోగా బ్రహ్మానంద రెడ్డి, పాణ్యం గ్రూప్ టెంపుల్స్ ఈవోగా సువర్ణను నియమించారు. వీరిలో వెల్దుర్తి గ్రూప్ టెంపుల్స్ ఈవో ఆంజనేయులు బుధవారం బ్రహ్మగుండం ఆలయంలో బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన ఈవోలు రెండు మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పేదలకు పట్టాభిషేకం

- భూ పంపిణీకి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆలూరు నియోజకవర్గంలో 495 మందికి హక్కు పత్రాలు
- ప్రారంభించిన మంత్రి గుమ్మనూరు
- రెండో విడతలో డిసెంబర్ 1న ఎమ్మిగనూరులో పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 6,422 కుటుంబాలకు చేకూరనున్న లబ్ధి
- అనుభవంలో ఉన్న భూములపై హక్కు
- రిజిస్ట్రేషన్ చార్జీలను కూడా భరిస్తున్న ప్రభుత్వం

కర్నూలు(అర్బన్): వారంతా రెక్కాడితే డొక్కాడని పేదలు.. కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునే వారు. రైతులమవుతామని వారు ఎప్పుడూ కలగనలేదు. రాష్ట్ర ప్రభుత్వం వీరి స్తోమతను పెంచింది. కూలీలను రైతులుగా మార్చింది. సమాజంలో వారు గౌరవంగా బతికేందుకు అవకాశాన్ని కల్పించింది. ఏళ్ల తరబడి సాగులో ఉన్న భూములకు సంపూర్ణ యాజమాన్య హక్కులు ఇవ్వడంతోపాటు అర్హులైన లబ్ధిదారులకు భూమిని పంపిణీ చేసింది. ఈ బృహత్తర కార్యక్రమాన్ని బుధవారం కర్నూలు జిల్లాలోని ఆలూరు నియోజకవర్గం నుంచి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పనా శాఖా మంత్రి గుమ్మనూరు జయరాం ప్రారంభించారు. రెండో విడతగా డిసెంబర్ 2వ తేదీన ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 348.03 ఎకరాలకు సంబంధించి 247 మంది దళితులకు హక్కు పత్రాలను అందించనున్నారు.

సంపూర్ణ యాజమాన్య హక్కులు

భూమి కొనుగోలు పథకంలో భాగంగా 1982 నుంచి 2014 వరకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అందించిన భూములకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ యాజమాన్య హక్కులు అందిస్తోంది. ఈ పథకంలో భాగంగా భూములు పొందిన దళిత రైతులకు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తూ వైఎస్సార్ హయాంలో జీఓ నెంబర్ 492ను జారీ చేశారు. అయితే రుణాలు మాఫీ అయినా భూములకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్లు ఎస్సీ కార్పొరేషన్‌లో తనఖాలోనే ఉండిపోయాయి. ఈ నేపథ్యంలోనే భూమి కొనుగోలు పథకంలో భాగంగా దళితులు సాగు చేసుకుంటున్న భూములకు ఒరిజినల్ డాక్యుమెంట్లను అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. ఈ మేరకు ఈ ఏడాది ఆగస్టు 8వ తేదీన జీఓ నెంబర్: 51 జారీ చేశారు. దీంతో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల జాబితాలను పరిశీలించి వారికి ప్రభుత్వమే ముద్రించిన భూ యాజమాన్య హక్కు పత్రాలను అందిస్తున్నారు.



ఆలూరులో పేదలకు భూహక్కు పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

రెండు జిల్లాలో భూ పంపిణీ వివరాలు..

జిల్లా	మొత్తం లబ్ధిదారులు	అందించనున్న భూములు ఎకరాల్లో
కర్నూలు	2,582	3,002
నంద్యాల	2,376	3,420
మొత్తం	4,958	6,422

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా..

జీఓ ప్రకారం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని లబ్ధిదారుల భూములకు యాజమాన్య హక్కు పత్రాలు అందించడంతో పాటు రిజిస్ట్రేషన్ చార్జెస్‌ను కూడా ప్రభుత్వం భరిస్తోంది. ఒక్కో లబ్ధిదారునికి భూమిని రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చేందుకు రూ.1,200 ఖర్చు రానుంది. ఈ ప్రకారం 3,533 మంది లబ్ధిదారులకు అయ్యే ఖర్చు రూ.42,39,600లను ప్రభుత్వమే భరిస్తోంది. ఈ పథకం కింద భూములు పొందిన లబ్ధిదారులు ఎవరైనా మృతి చెంది ఉంటే వారి వారసుల వివరాలను పక్కాగా సేకరించి వారికి యాజమాన్య హక్కు పత్రాలను అందించనున్నారు.

పేదల కుటుంబాల్లో వెల్లివిరుస్తున్న సంతోషం

కర్నూలు జిల్లాలో భూమిలేని 2,582 మంది పేదలకు 3,002.18 ఎకరాలను పంపిణీ చేస్తున్నారు. నంద్యాల జిల్లాలో 2,376 మందికి 3,420.87 ఎకరాలను పంపిణీ చేయనున్నారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్‌లోనే ఉన్న దళిత రైతులకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంటకు సంబంధించి 5,058 ఎకరాలకు యాజమాన్య హక్కులు లభించనున్నాయి. దీంతో పేదల కుటుంబాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

హక్కు పత్రాలు అందిస్తున్నాం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మా కార్యాలయంలో తనఖాలో ఉన్న హక్కు పత్రాలను అందించేందుకు చర్యలు చేపట్టాం. విడతల వారీగా ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాం.

– ఎస్ శ్రీనివాసకుమార్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ పేదల పక్షమే

ఆలూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎప్పటికీ పేదలకు అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. ఆలూరులోని ఇబ్రహీం ఫంక్షన్‌హాల్‌లో 709 మంది లబ్ధిదారులకు 889.31 ఎకరాలకు సంబంధించి భూ హక్కు పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలవారికి ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరవేర్చారన్నారు. కులమతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ ఏదో రకంగా ప్రభుత్వం మంచి చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో ప్రతి పనిలో అవినీతి, అక్రమాలు ఉండేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవినీతికి తావులేకుండా పారదర్శకంగా పథకాలను అమలు చేస్తోందన్నారు. టీడీపీ నేతల కల్లబొల్లి మాటలను నమ్మొద్దని సూచించారు. మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత నారాయణ స్వామి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్, ఎంపీపీ రంగమ్మ, వివిధ మండలాలకు చెందిన పార్టీ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



అప్పట్లో మాకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సర్వే నెంబర్: 28/3సీలో 1.64 ఎకరాల భూమిని మార్జిన్‌మనీ, సబ్సిడీపై ఇచ్చారు. అయితే ఆ భూమికి సంబంధించి ఇంకా అప్పు ఉండడంతో పత్రాలు ఎస్సీ కార్పొరేషన్‌లోనే ఉన్నాయి. పేదోళ్ల దేవుడు వైఎస్సార్ అప్పులు మాఫీ చేయడం, జగనన్న దయ వల్ల మా భూమికి సంబంధించిన రిజిష్టర్ పత్రాలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

– జయమ్మ, బండపల్లి, దేవనకొండ మండలం

మా ఇంటికి పండగొచ్చింది



ఇప్పటి వరకు మా భూమి లేదు. కూలీలుగా జీవనం సాగిస్తున్నాం. అధికారులు మా వివరాలు తీసుకున్నారు. అన్ని అర్హతలు ఉండడంతో భూ పంపిణీ జాబితాలో మా పేరు వచ్చింది. బుధవారం ఆలూరులో భూ పంపిణీ చేశారు. మంత్రి చేతుల మీదుగా 1.20 ఎకరాల భూమిని మాకు అప్పగించారు. దీంతో మా ఇంటికి పండగ వచ్చింది.

–సుజాత, అంగసకల్, ఆలూరు మండలం

భూ యజమానినయ్యాను



మాకు సెంటు భూమి లేదు. మా తాత, మా నాన్న, మేం కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను బతికించుకుంటున్నాం. ఎప్పటికైనా రైతును అనిపించుకోవాలనే ఆశ ఉండేది. నా భార్య, నేను తెచ్చిన కూలి డబ్బులు కుటుంబ ఖర్చులకే సరిపోయేవి. నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇప్పట్లో ఎకరా పొలం కొనాలంటే లక్షల్లో డబ్బులు కావాలి. ఈ జన్మకి నా కల నెరవేరుదు అనుకున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దయతో రెవెన్యూ అధికారులు భూమి లేని వారిని గుర్తించారు. నాకు యాటకల్లు సమీపంలో 1.12 ఎకరాకు భూమి ఇచ్చారు. బుధవారం ఆలూరులో మంత్రి గుమ్మనూరు జయరాం చేతులు మీదుగా పట్టాను అందుకున్నారు. భూ యజమానిని అయినందుకు చాలా సంతోషం ఉంది

– వెంకప్ప, తొగలగల్లు గ్రామం, ఆస్పరి

మూడు నెలల్లో టమాటా ప్రాసెసింగ్ యూనిట్

- అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించిన సీఎం వైఎస్ జగన్
- వర్చువల్‌గా యూనిట్‌కు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి
- సిగాచి ఫార్మా, ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్, ఎంఎస్ఎంఈ పార్కు పనులకు సైతం శంకుస్థాపనలు
- హాజరైన జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, చిత్రంలో కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి తదితరులు

కర్నూలు(సెంట్రల్): పత్తికొండలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌ను మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. తాను పత్తికొండ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలలకే యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన కలెక్టర్ డాక్టర్ జి.సృజనను అభినందించారు. పత్తికొండలో రూ.12.05 కోట్లతో 3.60 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్న టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అలాగే ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో రూ. 280 కోట్లతో ఏర్పాటు కానున్న సిగాచి ఫార్మా, రూ. 90 కోట్లతో ఏర్పాటయ్యే ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ న్యూట్రాస్యూటికల్ పరిశ్రమ, ఓర్వకల్లు మండలం గుట్టపాడు రూ.21.40 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కులో మౌలిక వసతుల పనులకు సంబంధించి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పాణ్యం, పత్తికొండ ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి వీక్షించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆయా పరిశ్రమల ద్వారా కర్నూలు జిల్లా రూపరేఖలు మారిపోతాయన్నారు. చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఆయా పరిశ్రమలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత అధికారులపై ఉందన్నారు.

➡ టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో కర్నూలు జిల్లాలో 10, నంద్యాల జిల్లాలో రెండు మండలాల్లో 4,788 హెక్టార్లలో పండే 1.68 లక్షల టన్నుల టమాటాను ప్రాసెసింగ్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ యూనిట్ ద్వారా టమాటా పౌడర్, కెచప్, సాస్ తదితర పదార్థాలను తయారు చేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేయవచ్చన్నారు.

➡ ఓర్వకల్లు మండలం గుట్టపాడులో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ క్లస్టర్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని కలెక్టర్ తెలిపారు. 219 ఎకరాల్లో ఏర్పాటయ్యే క్లస్టర్‌లో రోడ్లు, కాలువలు, విద్యుత్ తదితర సదుపాయాలకు రూ.21.40 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

➡ ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ పార్కులో ప్రముఖ సిగాచి కంపెనీ రూ.280 కోట్లను పెట్టుబడిపెట్టేందుకు ముందుకు రావడం సంతోషకరమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పరిశ్రమ కోసం ఏపీఐఐసీ ద్వారా 25 ఎకరాలను కేటాయించామన్నారు. అలాగే రూ.90 కోట్లతో ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్‌ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో న్యూట్రాస్యూటికల్ పరిశ్రమ ఏర్పాటు కానున్నదని, దీని కోసం 11 ఎకరాల భూమిని కేటాయించినట్లు చెప్పారు.

➡ పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. జూలై 1వ తేదీన పత్తికొండకు వచ్చిన జగనన్నకు టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని విన్నవిస్తే వెంటనే స్పందించారన్నారు. పత్తికొండ ప్రాంతంలో 6 వేల మంది రైతులు టమాటాను సాగు చేస్తారని ప్రాసెసింగ్ యూనిట్ వీరికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇటీవల హంద్రీనీవా నుంచి 77 చెరువులకు నీటిని ఇచ్చే పథకాన్ని కూడా జగనన్న ప్రారంభించి రైతుల నీటి కష్టాలను తీర్చారన్నారు.

➡ పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. 10 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ హబ్‌ను ఏర్పాటు చేశామని, ఇక్కడి నీటి కోసం రూ.290 కోట్లు ఖర్చు చేసి ముచ్చుమర్రి నుంచి పైపులైన్ ద్వారా తెచ్చే పనులు వేగంగా సాగుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డుచైర్మన్ ప్రభాకరరెడ్డి, ఐలా చైర్మన్ రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఈడీ ఉమాదేవి, పరిశ్రమల శాఖ జీఎం ప్రసాదు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నారు



నేను మూడు ఎకరాల్లో టమాటాను సాగు చేస్తున్నా. ఏటా ఏదో సమయంలో ధరలు పడిపోతాయి. ఆ సమయంలో రైతులు పండించిన పంటను పడేయాల్సి వస్తోంది. గతంలో డిప్యూటీ సీఎంగా పనిచేసిన కేఈ కృష్ణమూర్తి టమాటా జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తానని చెప్పి మోసం చేశారు. ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాటనిలబెట్టుకుని సీఎంతో మాట్లాడి ఫ్యాక్టరీని తెప్పించారు. టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌కు శంకుస్థాపన చేయడం చాలా సంతోషం.

– కె.నాగిరెడ్డి, రైతు, హోసూరు, పత్తికొండ మండలం

రైతుకు గిట్టుబాటు ధర లభిస్తుంది



నేను యేటా 7 ఎకరాల్లో టమాట సాగు చేస్తా. ధరలు పడిపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. ఇక నుంచి నాకు నష్టం అనేదే రాదు. పండించిన పంటను మార్కెట్‌కు బదులుగా ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకెళ్తా. అక్కడ కచ్చితంగా గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలుచేస్తారు. పత్తికొండ రైతుల ఆశను తీర్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– బి.ఆంజనేయులు, రైతు, పెద్దహుల్తి, పత్తికొండ

నేడు సీఎం వైఎస్ జగన్ రాక



సాక్షి, నంద్యాల/అవుకు: గాలేరు నగరి సుజల స్రవంతి(జీఎన్ఎస్ఎస్)లో భాగంగా చేపట్టిన అవుకు రెండో టన్నెల్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో గురువారం ఉదయం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించి, జాతికి అంకితం చేయనున్నారు. సీఎం పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

సీఎం పర్యటన సాగుతుందిలా..

- గురువారం ఉదయం 10.20 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- అక్కడి నుంచి విమానంలో 11.15 గంటలకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు వస్తారు.
- 11.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11.45 గంటలకు అవుకు మండలం మెట్టుపల్లి గ్రామానికి చేరుకుంటారు.
- 11.45 నుంచి 11.55 వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు.
- 11.55 గంటలకు మెట్టుపల్లి నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు అవుకు టన్నెల్ సైట్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.15 గంటలకు అవుకు టన్నెల్ ద్వారా నీటిని విడుదల చేసి సొరంగాన్ని ప్రారంభించి, జాతికి అంకితం చేస్తారు.
- 12.15 నుంచి 12.20 వరకు అవుకు టన్నెల వద్ద ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు.
- 12.20 నుంచి 12.25 వరకు టన్నెల్ వద్ద ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరిస్తారు.
- 12.25కు అవుకు టన్నెల్ సైట్ నుంచి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి మెట్టుపల్లి వద్ద నున్న హెలిపాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12.30 నుంచి 12.50 వరకు జిల్లా నాయకులతో సమావేశమవుతారు.
- 1 గంటకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 1.30 గంటలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.

తప్పుల్లేని ఓటరు జాబితా రూపొందిస్తున్నాం



మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్–2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఒకే వ్యక్తి రెండు ఓట్లు ఉన్నా, ఒకే ఫొటోతో రెండు చోట్లు ఓటు ఉన్నా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముసాయిదా జాబితాలో ఏమైనా తప్పులను గుర్తించి ఉంటే ఫారం–6, 7, 8లను అందజేయాలని సూచించారు. బీఎల్ఓలు ఎన్నికల విధులను బాధ్యతగా పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, నిబంధనల మేరకు రాజకీయపార్టీలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాగా.. కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో టీడీపీ నాయకులు అత్యుత్సాహం చూపారు. అందరూ గంపగుత్తగా హాజరై బీఎల్ఓలు ఇంటింటా తిరగడంలేదని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆరేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నం

● కామాంధున్ని చితకబాదిన రైతులు

బొమ్మలసత్రం: కామంతో కళ్లు మూసుకుపోయిన ఓకామాంధుడు ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన ఘటన నంద్యాలలో బుధవారం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని పొన్నాపురం కాలనీలో చిన్నారి తల్లిదండ్రులతో కలిసి నివాసముంటోంది. తండ్రి రోజువారి కూలిపనిచేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి సమీపంలో కొంత కాలంగా ఓ యువకుడు టీవీ మెకానిక్ షాప్ నడుపుతున్నాడు. ఈక్రమంలో పాపతో పరిచయం పెంచుకున్నాడు. తండ్రి, తల్లి ఇంట్లో లేని సమయంలో యువకుడు చిన్నారికి మాయమాటలు చెప్పి సమీపంలోని పంట పొలాల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ చిన్నారిపై లైంగికదాడికి యత్నించడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల పొలాల్లో పనులు చేసుకుంటున్న రైతులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో చిన్నారి జరిగిన విషయం రైతులకు వివరించింది. దీంతో ఆగ్రహించిన రైతులు యువకున్ని చితకబాది పోలీసులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీటి సంపులో పడి బాలిక మృతి

నందవరం: మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో ప్రమాదవశాత్తూ నీటి సంపులో పడి కృష్ణవేణి(8)అనే బాలిక మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇవి..బుధవారం ఆ గ్రామంలోని మారెప్ప, రత్నమ్మ దంపతుల కుమార్తె కృష్ణవేణి తాగునీటి కోసం ఊరి చివరిలోని నీటి సంపు వద్దకు వెళ్లింది. సంపులో నీరు అడుగు భాగన ఉండడంతో తాడు సహాయంతో పైకి తీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ కాలు జారి నీటి అందులో పడిపోయింది. పక్కన్న ఉన్న బాలికలు కేకలు వేయడంతో చుట్టు పక్కవారు వచ్చి బాలికను బయటకు తీశారు. వెంటనే కృష్ణవేణిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదవశాత్తూ బాలిక మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

కేజీబీవీల్లోని పార్ట్‌టైం పీజీటీలకు వేతనాల పెంపు

కర్నూలు సిటీ: కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పార్ట్‌టైం పీజీటీలుగా పనిచేస్తున్న వారి వేతనాన్ని రూ.12 వేల నుంచి రూ.26,759 పెంచుతూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పెంచిన వేతనాలు డిసెంబర్ 1 నుంచే అమలులోకి రానున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 53 కస్తూర్బాగాంధీ విద్యాలయాలు ఉన్నాయి. వీటిలో 59 మంది పార్ట్ టైం పీజీటీలు పనిచేస్తున్నారు. వేతనాలు పెంచడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బిల్లు చెల్లించకుంటే విద్యుత్ కనెక్షన్ల తొలగింపు

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారి విద్యుత్ బిల్లు గురువారంలోపు చెల్లించిన పక్షంలో ఆయా కనెక్షన్లను శుక్రవారం నుంచి తొలగించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. బుధవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలయ్యేలా చూడాలన్నారు. ప్రతి ఏఈ, ఏడీఈ, ఈఈలు తమ పరిధిలోని బిల్లులు చెల్లించని కనెక్షన్ల జాబితాపై కింది స్థాయి సిబ్బందితో సమీక్షించాలన్నారు.

సంక్షేమ బావుటా



సీఎం మేలు మరువలేం



మాది పేద కుంటుంబం. మా నాన్న లేట్ పుల్లన్న. ఎనిమిది నెలల క్రితం అనారోగ్యంతో మర ణించారు. ఆలూరులోని మెయిన్ బజార్ కాలనీ నివాసం ఉంటున్నాం. మేము నలుగురం సంతానం. ఏడాది క్రితం హొళగుంద మండల కేంద్రానికి చెందిన చంద్రశేఖర్‌తో నాకు వివాహం జరిగింది. మా కుటుంబానికి ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణ మస్తు కింద రూ.50 వేలు మంజూరు చేసింది. నా భర్త ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేసి జీవనం సాగిస్తున్నాడు. పిల్లల పెళ్లి అంటే తల్లిదండ్రులకు ఆర్థికంగా భారం. ఈ భారం తగ్గించేందుకు వైఎస్సార్ కళ్యాణ మస్తు ఉపయోగపడింది. వలంటీర్ సహాయంతో సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే మా అమ్మ లింగమ్మ ఖాతాలోకి రూ.50 వేలు జమయ్యాయి. సీఎం మేలు మరువలేం.

– చంద్రశేఖర్, మాధవి, నూతన వధూవరులు, ఆలూరు

సంతోషంగా జీవిస్తున్నాం



మాది పాములపాడు మండలం వేంపెంట గ్రామం. నేను వికలాంగుడిని. నా భార్య కలిసి టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు అర్ధ ఎకరా పొలం ఉంది. వేరు కాపురం పెట్టిన తరువాత చాలా ఇబ్బందులు పడ్డాం. ఇద్దరు మగ పిల్లలు, వారి చదువు, కుటుంబ పోషణ చాలా కష్టపడాల్సి వచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా కష్టాలు తీరాయి. ప్రభుత్వం నుంచి అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు రావడంతో పెద్దబ్బాయి సృజన్ అగ్రికల్చర్ డిగ్రీ, చిన్నబ్బాయి తరుణ్‌తేజ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. నాకు వికలాంగ పింఛన్ రూ.3వేలు వస్తోంది. జగనన్న చేదోడు కింద ఇప్పటికి 4 సంవత్సరాల్లో రూ.40వేలు వచ్చాయి. ఆ డబ్బు ఖర్చు చేయకుండా జిక్కి 5 (టైలరింగ్) మిషన్ కొనుగోలు చేయాలని దాచుకున్నాను. నా భార్య పేరిట జగనన్న తోడు రూ.10,000 అప్పు తీసుకుని, రెగ్యులర్‌గా చెల్లిస్తున్నాం. స్త్రీ నిధి క్రింద రూ.50,000 తీసుకున్నాం. జగనన్న చలువతో సంతోషంగా జీవిస్తున్నాం.

– బోనాల నాగేశ్వరరావు, మరియమ్మ

నలంద కళాశాలలో విద్యార్థుల మధ్య ఘర్షణ



చేయి విరిగిన విద్యార్థి సాయినరసింహ



విద్యార్థులను విచారిస్తున్న ఆర్ఐఓ గురువయ్యశెట్టి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నలంద కళాశాలలో జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలకు సర్ధిచెప్పేందుకు వెళ్లిన ఓ విద్యార్థిపై కళాశాల యాజమాన్యం కర్రతో కొట్టడంతో చేయి విరిగింది. కళాశాల హాస్టల్‌లో కొంతకాలంగా జూనియర్, సీనియర్ విద్యార్థుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి భోజనం చేసేక్రమంలో జూనియర్ విద్యార్థులు వరుసలో నిలబడి ఉండగా ముందు తాము భోజనం చేసిన తర్వాత జూనియర్స్ చేయాలని సీనియర్స్ చెప్పడంతో వివాదం చోటుచేసుకుంది. కళాశాల యాజమాన్యం అక్కడికి చేరుకుని విద్యార్థులను మందలించి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడించారు. ఆ తర్వాత కొంత మంది విద్యార్థులు తల వెంట్రుకలు చాలా పొడవుగా పెంచుకుని ఉండటం గమనించి ట్రిమ్ చేయించారు. కాగా మరోసారి అర్ధరాత్రి జూనియర్, సీనియర్ విద్యార్థులు గొడవపడ్డారు. ఈక్రమంలో తాను నచ్చజెప్పేందుకు వెళ్లాలని సీనియర్ విద్యార్థి సాయినరసింహ తెలిపారు. ఉదయం కళాశాల డైరెక్టర్ మహేశ్వరరెడ్డి తనను పిలిచి వాచ్‌మెచ్ చేతిలో ఉన్న కర్రతో కొట్టడంతో తన చేయి విరిగిందన్నారు. ఇదే విషయమై వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. అకారణంగా విద్యార్థి చేయి విరగ్గొట్టిన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టి, కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల జోక్యంతో వారు ఆందోళన విరమించారు. కాగా విషయం తెలుసుకున్న ఆర్ఐఓ గురవయ్య శెట్టి నలంద జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థుల గొడవ, చేయి విరిగిన విషయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ విద్యార్థులు సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. తమ ఇష్ట ప్రకారమే ట్రిమ్ చేయించుకున్నామని తెలిపారన్నారు. మరోసారి విచారణ చేసి నిజమని తేలితే కళాశాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

రక్త కన్నీరు!

● 13 ఏళ్ల బాలుడికి బ్లడ్ క్యాన్సర్
● ఆర్థిక స్థోమతలేక అవస్థలు పడుతున్న తల్లిదండ్రులు
● ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



అచ్యుత్ కుమార్‌తో తల్లిదండ్రులు

ఓర్వకల్లు: ఆటలాడుతూ.. అల్లరి చేసే ఆ బాలుడికి మాయదారి రోగం వచ్చింది. పేద కుటుంబానికి పెద్ద కష్టాన్ని తెచ్చి పెట్టింది. ఏడేళ్లుగా ఆ బాలుడు నరక యాతన అనుభవిస్తున్నాడు. ఆర్థిక స్థోమత లేక అపన్న హస్తం కోసం తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఓర్వకల్లు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన కవిత, పరమేష్ దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి అచ్యుత్ కుమార్, హర్షవర్ధన్ కుమారులు. పెద్ద కుమారుడు అచ్యుత్ కుమార్(13)కు ఆరేళ్ల వయస్సు నుంచి తరచుగా జ్వరం రావడం, రక్తకణాలు తగ్గిపోవడం జరుగుతూ ఉండేది. తెలిసిన చోటల్లా అప్పులు చేసి వైద్యం చేయించారు. వైద్యానికి ఇప్పటికే సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేశారు. ఈ ఏడాది మార్చిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేర్పించగా పరీక్షల అనంతరం అక్కడి వైద్యులు బెంగళూరుకు రెఫర్ చేశారు. బెంగళూరులో వైద్య పరీక్షలు చేసి బ్లడ్ క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధి నయం కావాలంటే దాదాపు రూ.30 లక్షలు ఖర్చవుతుందని అక్కడి వైద్యులు తెలిపారు. అంత డబ్బు లేక తల్లిదండ్రులు దిక్కుతోచక ఇంటికి వెనుతిరిగి వచ్చారు. కుమారుడి అవస్థ చూడలేకఇతరుల వద్ద అప్పులు చేసి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయాలని, రూ.20 లక్షలు ఖర్చు వస్తుందని చెప్పడంతో కొందరి సలహా మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధికింద దరఖాస్తు పెట్టుకున్నారు. ప్రభుత్వం రూ.8 లక్షల ఆర్థిక సహాయం అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మిగతా రూ.12 లక్షల కోసం ఆ నిరుపేద తల్లిదండ్రులు ఆరాటపడుతున్నారు. దాతలు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీస్ దాడులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

కర్నూలు: నగరంలోని బంగారుపేటలో నాటుసారా స్థావరాలపై రెండో పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. తరచూ తనిఖీలు జరుగుతున్నప్పటికీ నీలిషికారీలు సారా తయారీ మానుకోకపోవడంతో బుధవారం ఉదయం పోలీసులు పెద్ద ఎత్తున కాలనీకి చేరుకుని నీలిషికారీల ఇళ్లల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అలాగే కేసీ కెనాల్ వెంట సోదాలు చేసి సారా అమ్ముతున్న ఎన్.ఎస్.శాంతమ్మ, ఎస్.ఎస్.రామ్‌జీ, నీలిషికారి రజియాలను అరెస్టు చేశారు. ఒక్కొక్కరి వద్ద 20 లీటర్ల చొప్పున మొత్తం 60 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు. కేసీ గట్టుపై ఉన్న సారా బట్టీలను ధ్వంసం చేసి సారా తయారీకి వినియోగించిన పాత్రలు, బిందెలు, కుండలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. రెండో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా నేతృత్వంలో దాడులు నిర్వహించి సారా తయారీదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సారా తయారీ, అమ్మకాలను మానుకుని గౌరవప్రదమైన జీవితం గడపాలని సూచించారు. సారా తయారీ మానుకోకపోతే పీడీ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బతుకుబాటలో మృత్యుఒడికి

● రోడ్డుప్రమాదంలో కూరగాయల వ్యాపారి దుర్మరణం
● కుమారుడికి తీవ్ర గాయాలు



మృతిచెందిన అబ్దుల్ రజాక్



తీవ్రంగా గాయపడిన అజ్మతుల్లా

గడివేముల: ఓ కూరగాయల వ్యాపారి బతుకు బాటలో మృత్యుఒడికి చేరాడు. కుమారుడితో కలిసి కూరగాయలు విక్రయించేందుకు బయలుదేరిన అతడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటన మండల పరిధిలోని బూజునూరు వైఎస్ పెట్రోల్‌బంకు వద్ద బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. గడివేముల మండల కేంద్రానికి చెందిన అబ్దుల్‌రజాక్ (45) ఆటోలో కూరగాయాలు వేసుకుని పల్లెలకు తిరిగి విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. రోజూలాగే కుమారుడు అజ్మతుల్లాతో కలిసి అబ్దుల్ రజాక్ బుధవారం తెల్లవారుజామునే కూరగాయాల ఆటోతో పల్లెలకు బయలుదేరాడు. స్థానిక వైఎస్ రెడ్డి పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే నంద్యాల నుంచి జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ ఆటోను ఢీకొంది. ప్రమాదంలో అబ్దుల్ రజాక్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా కుమారుడు అజ్మతుల్లా తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు అజ్మతుల్లాను నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్ గంగోలు నాగరాజును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు.

ద్విచక్రవాహనాల ఢీ

● ఒకరు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని ఆలూరు రోడ్డు శంకర్ నగర్ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. కల్లుబావి కాలనీకి చెందిన నరసప్ప(43) హమాలీ పని ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. భాస్కర్‌రెడ్డి కాలనీకి చెందిన చంద్రశేఖర్ పాత బస్టాండు వద్ద గోబీ పాయింట్‌కు వెళ్తుండగా శంకర్‌నగర్ సమీపంలో వీరి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో నరసప్ప అక్కడికక్కడే మృతిచెందగా చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

నారాయణ కాలేజీల కోర్ డీన్ లింగేశ్వరరెడ్డిని అరెస్టు చేయాలి

● సీపీఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): మహిళా అధ్యాపకులను లోబర్చుకోవడం, విద్యార్థినులను వేధించడం వంటి పనులకు పాల్పడుతున్న నారాయణ కాలేజీల కోర్ డీన్ లింగేశ్వరరెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ, ఎస్ఎఫ్ఐ వేర్వేరుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ఎన్ రసూల్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ..లింగేశ్వరరెడ్డి రాసలీల వీడియోలపై విచారణ జరపాలన్నారు. అనేక అస్తులు సంపాదించుకున్న అయనపై సీఐడీ విచారణ చేయాలన్నారు. గతంలోనూ అధ్యాపకులను వేధించినట్లు ఆయనపై ఆరోపణలు వస్తే అధికారుల అండతో తప్పించుకున్నారన్నారు. ప్రస్తుతం అదే ఆరోపణలపై మీడియాలో ప్రత్యేక కథనాలు వస్తున్నా పోలీసులు గాని, విద్యాశాఖాధికారులుగాని ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. అంతేకాక ఆయన గతంలో మహిళా పర్సస్ సహకార బ్యాంకు ఆస్తులను కొట్టేశారన్నారు. వెంటనే ఎస్పీ స్పందించి లింగేశ్వరరెడ్డి కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్యకళాశాలలో ర్యాగింగ్‌ను ఉపేక్షించం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు అవకాశం లేదని, ఒకవేళ ర్యాగింగ్ జరిగిందని తెలిస్తే ఉపేక్షించేది లేదని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ అన్నారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓ వ్యక్తి కళాశాల వసతి గృహాల్లో ర్యాగింగ్ జరుగుతోందని ఎన్ఎంసీకి ఫిర్యాదు చేశారని, దీనిపై యూజీసీ వివరణ కోరిందన్నారు. వసతి గృహాల్లో ర్యాగింగ్‌కు అవకాశం లేదని, ఈ మేరకు హాస్టల్ వార్డెన్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారన్నారు. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ అనుమానం ఉన్న విద్యార్థులను ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఎన్ఎంసీకి అందించిన ఫిర్యాదుపై విచారణ చేస్తామని, ర్యాగింగ్ జరిగినట్లు తెలిస్తే సదరు విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అనంతరం కమిటీ సభ్యులు మెన్స్, ఉమెన్స్ హాస్టల్స్‌లో వేర్వేరుగా పర్యటించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ర్యాగింగ్‌కు సంబంధించి ఆరా తీశారు. ఈ మేరకు వారు నివేదిక తయారు చేయనున్నారు. సమావేశంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ చిట్టినర్సమ్మ, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ వార్డెన్ డాక్టర్ జయరామ్, అసిస్టెంట్ వార్డెన్ డాక్టర్ సోమశేఖర్, ఉమెన్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ మాధవీశ్యామల తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్ర స్వామికి కోటి పుష్పార్చన



పుష్పార్చన చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రాఘవేంద్ర మూలబృందావనానికి బుధవారం కోటి పుష్పాలతో అర్చన చేశారు. కర్ణాటక రాష్ట్రం దారవాడకు చెందిన అఖిల భారత విజయదాసర క్షేత్ర ఆరాధన సమితి కోటి పుష్పాలను సమకూర్చింది. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతుల మీదుగా అర్చన నిర్వహించారు. వేదమంత్రోచ్ఛరణలు, అశేష జనవాహిని మధ్య వేడుక కనుల పండువగా సాగింది. అలాగే ఆలయ మందిరంలో గోవర్ధన, తులసి పూజలు నిర్వహించి, ధాత్రి హోమం చేపట్టారు. వేడుకల్లో మఠం మేనేజర్ శ్రీనివాస రావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తృతం చేయాలి

కర్నూలు (న్యూటౌన్): బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను విస్తృతం చేయాలని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్ సంజీవ్‌కుమార్ అన్నారు. బుధవారం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ఆరు మారుమూల గ్రామాలకు కొత్తగా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ టవర్లు మంజూరు కావడం సంతోషించదగ్గ విషయమన్నారు. బీఎస్ఎన్ఎల్ జీఎం రమేష్ మాట్లాడుతూ.. త్వరలో 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచడానికి సంస్థ అభివృద్ధికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో ల్యాండ్‌ఫోన్, ఇంటర్‌నెట్‌తోపాటు టీవీలో ప్రసారాలను ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రిటైర్డ్ తహసీల్దార్ రోషన్‌అలీ, టెలికం అడ్వయిజరీ కమిటీ మెంబర్లు అమడగుంట్ల కృష్ణారెడ్డి, కాకర్ల శాంతికుమార్ మాట్లాడారు. సమావేశంలో టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ మెంబర్లు పాలకుర్తి రమేష్, భీమేష్, అజయ్ కుమార్, కుబేరస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవు

కర్నూలు(సెంట్రల్): తెలంగాణలో ఓటు ఉన్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగులకు గురువారం వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు. తెలంగాణలో ఓటు ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

45 రోజుల్లో 15,891 ఇళ్లను పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): వైఎస్ఆర్ జగనన్న కాలనీల్లో 45 రోజుల్లో 15,891 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు.బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులు, ఏజెన్సీలతో ఆమె సమీక్షించారు. బేస్మెంట్ లెవల్‌లో 11,938, రూఫ్ లెవల్‌లో 2,383, ఆర్‌సీ లెవల్‌లో 1,814 ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. వీటిని కచ్చితంగా 45 రోజుల్లోపూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణాలకు కావాల్సిన ఇసుక, ఇటుక, సిమెంట్, ఇనుము, సెంట్రింగ్ చేసే పనివారు, కూలీలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడా ఆలస్యం జరిగినా పనులు ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. హౌసింగ్ డీఈలు ఎప్పటికప్పుడు కింది స్థాయి సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేసుకొని కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, గనుల శాఖ అధికారి రాజశేఖర్, ఆర్‌డీఓలు హరిప్రసాదు, రామలక్ష్మి పాల్గొన్నారు.

3న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కర్నూలు సిటీ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్(ఎన్ఎంఎంఎస్-జాతీయ ఉపకార వేతన)పరీక్ష వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 3,799 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. కర్నూలులో 6, ఆదోనిలో 11 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు గంట ముందుగాను కేంద్రాలకు చేరుకోవాలన్నారు. హాల్ టికెట్లను www.bse.ap.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

1న జిల్లా సీనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): జొహరాపురం రోడ్డులో ఉన్న రాయల్ కిడ్స్ టెన్నిస్ అకాడమీలో డిసెంబర్ 1వ తేదీ జిల్లా స్థాయి సీనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి నవీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకొని రావాలని సూచించారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 9, 10 తేదీల్లో శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. వివరాలకు 8688886300 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

కార్డుదారులకు సబ్సిడీపై కందిబేడలు

● ఒక్కో రేషన్ కార్డుకు కేజీ చొప్పున ఇచ్చేందుకు చర్యలు
● ఇప్పటికే ఎండీయూ ఆపరేటర్లకు ఆదేశాలు జారీచేసిన అధికారులు

కర్నూలు(సెంట్రల్): మార్కెట్‌లో కంది బేడల ధర పెరిగిన నేపథ్యంలో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. డిసెంబర్ నుంచి రేషన్‌కార్డుదారులందరికీ సబ్సిడీపై కంది బేడలను అందించనున్నట్లు చెప్పింది. రూ.67 చెల్లిస్తే ప్రతికార్డుకు కేజీ చొప్పున కంది బేడలను ఎండీయూ ఆపరేటర్లు అందించనున్నారు. కర్నూలు జిల్లాలో 6.71 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు ప్రతి నెలా బియ్యం, బ్యాళ్లు, చక్కెర, రాగులను ఎండీయూ వాహనాల ద్వారా ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోంది. నాలుగు నెలల నుంచి స్టాక్ లేకపోవడంతో కంది బేడలు పంపిణీ చేయడం లేదు. ఈ క్రమంలో డిసెంబర్ నుంచి కంది బేడలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు అందుబాటులో ఉంచింది. జిల్లాకు మొత్తం 671 టన్నుల అవసరం కాగా.. ఇప్పటికే 400 టన్నుల కందిబేడలు గోదాములకు చేరాయి. ఇందులో 360 టన్నులను డీలర్లు తీసుకెళ్లారు. మిగిలినవి ఒకటి, రెండు రోజుల్లో మండల స్థాయి స్టాక్ పాయింట్లకే చేరే అవకాశం ఉంది.

రాగులు కచ్చితంగా ఇవ్వాల్సిందే

రేషన్‌కార్డుదారులకు డిసెంబర్ నుంచి కచ్చితంగా రాగులు ఇవ్వాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి కార్డుకు బియ్యానికి బదులుగా కేజీ నుంచి మూడు కేజీలు రాగులను వినియోగదారుడు పొందవచ్చు. అయితే ఐదారు నెలల నుంచి రాగులు అందుబాటులో ఉన్నా వినియోగదారులకు ఎండీయూ ఆపరేటర్లు ఇవ్వడంలేదు. కొందరు డీలర్లు రాగులకు డీడీ కట్టి తీసుకెళ్లకపోవడమే ప్రధానకారణం. ఇదే సమయంలో బియ్యానికి ఒక సారి, రాగులు, చక్కెర, ఇతర ఆహార పదార్థాలకు ఒకసారి వినియోగదారుడి నుంచి తంబ్ తీసుకోవడానికి ఎండీయూ ఆపరేటర్లు నిరాకరిస్తుండడంతో కేవలం బియ్యం మాత్రమే డీలర్లు తీసుకెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బియ్యంతోపాటు చక్కెర, బ్యాళ్లు, రాగులను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడా రాగులు లేవనే ప్రశ్న ఉత్పన్నం కాకూడదని, ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లను హెచ్చరిస్తూ ఆదేశాలు విడుదల చేశారు. ప్రతి కార్డుకు అరకేజీ చొప్పున చెక్కరను కూడా ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఇందుకోసం రూ.17 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే వీట్ ఆటా గోధుమ పిండి కూడా కార్డులకు కేజీ చొప్పున వేస్తారు. ఇందుకోసం రూ.16లను వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది.